విశ్వసేన వాయిస్, దిన పత్రిక
లో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలో
జిల్లాల, నియోజకవర్గాల మరియు మండల
వారిగా రిపోర్టర్లు కావలెను ఫోన్ నంబర్:
9440701703

అను దినం - జనం వాయిస్
https://www.viswasenavoice.com
# విశ్వసేన వాయిస్
VISWASENA VOICE TELUGU DAILY

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక : 02 గురువారం 22 - 05 - 2025 ఎడిటర్ : ఎం రవీందర్ సెల్ : 9440701703 పేజిలు : 06 వెల : 04



## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

విశ్వసేన వాయిస్, మే 21, న్యూఢిల్లీ: దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్ర లో

- ముంబైలో అత్యధికంగా పాజిటివ్ కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించిన ప్రభుత్వం

2

## విశాఖలో యోగా ఇంటర్నేషనల్ డే

- యోగా మన వారసత్వ ప్రక్రియ
- సిఎం చంద్రబాబు వెల్లడి



2

విశ్వసేన వాయిస్, మే 21, అమరావతి: యోగా ఇంటర్నేషనల్ డేను ఆంధ్రప్రదేశ్‌లో ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖ కేంద్రంగా జూన్ 21న నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని మోడీ హాజరవుతారని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నాగరికతకు భారతదేశం పెట్టింది పేరన్నారు. యోగా మన వారసత్వమని.. యోగా ఇంటర్నేషనల్ డేగా గుర్తింపు రావడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణమన్నారు. యోగా మెరుగైన జీవనానికి దోహద పడుతుందని తెలిపారు. నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లో జరుపుకునే కార్యక్రమం యోగా అని చెప్పుకొచ్చారు. యోగా అనేది కొద్దిమందికో లేక.. కొన్ని ప్రాంతాలకో సంబంధించింది

## కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

- కెసిఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర
- ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం
- కెసిఆర్‌కు నోటీసులపై కెటిఆర్ విమర్శలు



2

విశ్వసేన వాయిస్, మే 21, నల్లగొండ: నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమిషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప రేవంత్ ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా

## రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

- ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టారన్న ఖర్గే
- తండ్రితో జ్ఞాపకాలను నెమరు వేసుకున్న రాహుల్



2

విశ్వసేన వాయిస్, మే 21, న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేడు 34వ వర్థంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ తనయుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేలు ఢిల్లీలోని వీర్ భూమి రాజీవ్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. వీరితోపాటు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, ఇతర కాంగ్రెస్ నేతలు కూడా స్మారక ప్రదేశంలో రాజీవ్‌కి ఘనంగా నివాళు లర్పించారు. రాజీవ్ గాంధీ వర్థంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనను భారతదేశ ముద్దుబిడ్డ అని అభివర్ణించారు. ఈ

## ఎపికి ఆరు కుంకీ ఏనుగుల అప్పగింత

- డిప్యూటి సిఎం పవన్ సమక్షంలో అప్పగింత కార్యక్రమం
- పంటపొలాలను,.రైతులను కాపాడడమే లక్ష్యమన్న పవన్

విశ్వసేన వాయిస్, మే 21, బెంగళూరు: కర్నాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చాయి. ఏపీకి ఆరు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక





2

# కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమిషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ కమిషన్ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# విశాఖలో యోగా ఇంటర్నేషనల్ డే

మొదటిపేజీ తరువాయి

కాదన్నారు. అందరి జీవితాల్లో యోగా అనేది ఒక భాగం కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా అని చెప్పుకొచ్చారు. ఫొటోలు, ఈవెంట్ కోసం ఒక రోజు చేసే కార్యక్రమం కాదన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమం యోగా అని తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రధాని మోదీ ఒక దీక్ష , పట్టుదలతో చేస్తున్నారన్నారు. నేటి (బుధవారం) నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర - 2025పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. 5 లక్షల మందితో వచ్చే నెల 21 తేదీన యోగా డే నిర్వహిస్తామని.. ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో యోగ డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 27 జిల్లాల్లో నెల రోజులపాటు యోగాంధ్ర పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మీడియా సైతం యోగాను ప్రమోట్ చేసేందుకు కృషి చేయాలని కోరారు. 2,500 మందిని మాస్టర్ ట్రైనర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కాగా.. విజయవాడ హరిత బెరంపార్కులో యోగాంధ్ర జనజాగృతి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులపాటు యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. నిపుణులు రూపొందించిన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ, అభ్యాసం చేస్తారు. యోగాలో శిక్షణ పొందిన కనీసం 20 లక్షల మందికి సర్టిఫికెట్ల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డు స్థాయిలో ప్రజలకు యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని.. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, యోగా ఔత్సాహికులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎపికి ఆరు కుంకీ ఏనుగుల అప్పగింత

మొదటిపేజీ తరువాయి

సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల అప్పగింత, వాటి సంరక్షణకు సంబంధించిన డాక్యుమెంట్లను పవన్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి, సీఎం సిద్ధరామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందుకొస్తోందన్నారు. ఏపీ, కర్ణాటక మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ ఆకాంక్షించారు. కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగులను నియంత్రించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించుతారు. కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్నిసార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగును రక్షించడానికి వీటిని ఉపయోగిస్తారు. సాధారణంగా కుంకీ ఏనుగులుగా మగవాటినే ఎంపిక చేసుకుంటారు. ఎందుకంటే ఇవి మాత్రమే ఒంటరిగా సంచరిస్తుంటాయి. వీటిని బంధించి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. తర్వాత ఆపరేషన్ల కోసం వాడుతుంటారు. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు ఇవి విశ్రమించవు. కొన్నిసార్లు పంట పొలాలపైకి వచ్చిన ఏనుగులతో ఇవి తలపడాల్సి ఉంటుంది కూడా. అందుకే పోరాడడంలోనూ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఏజెన్సీ ఏరియాల్లో ఏనుగుల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు శ్రీకాకుళం, సాలూరు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందన్నారు. అటవీ భూమిని ఆక్రమించడం వల్ల ఏనుగులే జనవాసాల్లోకి వస్తున్నాయో లేక ఏం జరుగుతుందో తెలియడం లేదన్నారు. కానీ ఈ తరహా సమస్యను కర్ణాటక ప్రభుత్వం చాలా పకడ్బందీ ప్రణాళికతో నిరోధిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈ ప్రభుత్వం చాలా ఏనుగులకు శిక్షణ ఇచ్చిందన్నారు. అంతేకాకుండా అవి ఎలా వ్యవహరించాలో కూడా శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఇక ఏనుగులు జనావాస ప్రాంతంలోకి రాకుండా.. వాటికి ప్రత్యేక మార్గం ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఆ ప్రాంతంలోని రైతుల భద్రతతో పాటు సురక్షిత చర్యలు తీసుకున్నట్లు అవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలోని పలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగులు ఊళ్లలోకి దూసుకు వచ్చి.. పంట పొలాలను నాశనం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారు. ఏ సమయంలో ఎటువైపు నుంచి ఏనుగులు దాడి చేస్తాయో తెలియని ఓ విధమైన భయాందోళన పరిస్థితి ఆ ప్రాంత ప్రజల్లో నెలకొంది. అంతేకాకుండా.. ఈ ఏనుగుల దాడి కారణంగా.. పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

# రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలని ప్రస్తావిస్తూ ఖర్గే ఎక్స్ పోస్టు చేశారు. రాజీవ్‌గాంధీ నేతృత్వంలోనే 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టెలికాం, ఐటి విప్లవానికి నాయకత్వం వహించారు. కంప్యూటరీకరణను అమలు చేశారు. సమ్మిళిత అభ్యాసంపై దృష్టి సారించిన కొత్త విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. రాజీవ్‌గాంధీ లక్షలాది మంది భారతీయులలో ఆశను ప్రేరేపించారు. 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన నిర్ణయాలు కీలకపాత్ర పోషించాయి అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈరాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాహుల్ తన తండ్రి రాజీవ్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఫొటోకు జతగా 'నాన్న మీ జ్ఞాపకాలు నన్ను ప్రతి అడుగులోనూ నడిపిస్తాయి. మీ నెరవేరని కలలను నిజం చేయడమే నా సంకల్పం. నేను వాటిని ఖచ్చితంగా నెరవేరుస్తాను' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ 40 ఏళ్ల వయసులోనే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అక్టోబర్ 1984 నుంచి 1989 డిసెంబర్ 2 వరకు ఆయన ప్రధానిగా ఉన్నారు. తమిళ ఈలం ఆత్మాహుతి దాడిలో ఆయన దుర్మరణం చెందారు.

# దేశంలో మళ్లీ కరోనా బెల్స్

మొదటిపేజీ తరువాయి

ఏకంగా వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్ట్‌లు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది. సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.

అను దినం - జనం వాయిస్
https://www.viswasenavoice.com
విశ్వసేన వాయిస్
VISWASENA VOICE TELUGU DAILY



# రైల్వే పార్కింగ్ చార్జీలు తగ్గించాలి

## పి. డి. ఎస్. యూ - పి. వై. ఎల్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మేనేజర్ కి వినతి



**విశ్వసేన వాయిస్, మే 21, ఖమ్మం:** రైల్వే స్టేషన్ లోని పార్కింగ్ ఛార్జీల తగ్గించాలని మరియు అధిక టెండర్ ల పేరుతో పార్కింగ్ షెడ్ పాట పాడి పేదలపై పార్కింగ్ చార్జీలు నిలువుదోపిడీ చేస్తున్న" రైల్వే పార్కింగ్ కాంట్రాక్టర్ రవి పై చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి వెంకటేష్, పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి భారత్ లు అధికారులను డిమాండ్ చేశారు. పి డి ఎస్ యు మరియు పి వై ఎల్ ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మేనేజర్ సుభాష్ చంద్రబోస్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి వెంకటేష్, పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి భారత్ లు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ లో ఉన్న పార్కింగ్ స్థలాలలను వేలంపాటలో అధిక ధరలకు పాట పాడుకొని రైల్వే స్టేషన్ పరిధిలో టూ వీలర్ పార్కింగ్ లో పెడితే రొండు గంటకు 15 రూపాయలు మూడు గంటలు కి అధికంగా 10రూపాయలు చొప్పున రెండు రోజులకు అక్షరాల 485 రూపాయలు వాహనదారులు దగ్గర నిలువుదోపిడీ వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టూ వీలర్ కాకుండా నాలుగు చక్రాల వాహనాలకు నెలకు పబ్లిక్ పేరుతో 2500 వరకు డబుల్ చార్జీ వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇదేంటి ఇంత అధికంగా చార్జర్లు వసూళ్లు చేస్తున్నానని కాంట్రాక్టర్ ని అడగ టెండర్స్ లో అధిక ధరకే పాట పాడాము గనకనే ఇంత చార్జీలు వసూలు చేస్తున్నాము అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ప్రయాణికుడు తన వెళ్ళవలసిన ట్రైన్ టిక్కెట్ కంటే ఎక్కువగా పార్కింగ్ పేరుతో వసూలు చేస్తున్నారని వారిపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల ఫలితంగానే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే పార్కింగ్ ఛార్జీలు తగ్గించకపోతే రైల్వే స్టేషన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా నాయకులు యశ్వంత్, పేరాల వెంకటేష్, ప్రసాద్, పి వై ఎల్ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

# చీకట్లో బస్సులకోసం మహిళ ప్రయాణికుల ఎదురుచూపులు



**విశ్వసేన వాయిస్, మే 21, తిరుమలాయపాలెం:** మండలకేంద్రంలో దుస్థితి చీకట్లో బిక్కుబిక్కుమంటూ.. మహిళల ప్రయాణికులు బస్సులకోసం ఎదురుచూస్తున్న ఈ దీన దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే, మరి ఇది ఎక్కడో కాదండి ఖమ్మం – వరంగల్ ప్రధాన హైవే ఆనుకోని ఉన్న తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ప్రతిరోజూ మహిళా ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఖమ్మం – వరంగల్ ప్రధాన హైవేకి అనుకోని ఉన్న ఈ గ్రామంలో, అధికారులు, గత పాలకులు హైవే వెంబడి సరైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేకపోయారు. సాయంత్రం 6 దాటితే చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయి. దీంతో స్థానిక ప్రయాణికులతోపాటు,వివిధ కార్యాలయలలో పనిచేసే మహిళా సిబ్బంది,విధులు ముగించుకుని,వెళ్లే రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ చిమ్మ చీకట్లో బస్సులకోసం ఎదురుచూస్తున్నారు. సరైన వీధి దీపాలు లేకపోవడంతో హైవే మీద వెళ్లే వాహనాల లైట్లే ప్రయాణికులకు వెలుతురుగా మారుతుంది. గ్రామంలో సంబంధిత మండల ప్రజాపరిషత్ కార్యాలయంతోపాటు, తహసీల్దార్, సీహెచ్సీ మరియు పీహెచ్సీ ఆరోగ్య కేంద్రాలు, పోలీస్ స్టేషన్, మహిళా సమైక్య కార్యాలయంతోపాటు ఇతర మండల కార్యాలయాలు కలిగి ఉన్నాయి. ఇట్టి కార్యాలల్లకు వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజు పురుషులు, మహిళలు, విద్యార్థులు వందల మంది వస్తూ వెళుతుంటారు. అంతే కాదు. స్థానిక సీహెచ్సీ ఆరోగ్య కేంద్రం అప్ గ్రేడ్ కావడంతో, షిఫ్ట్ డ్యూటీలు చేసే మహిళ సిబ్బంది ఎల్లవేళలా ప్రయాణాలు చేస్తున్నారు. సాయంత్రం వేళ కాస్త ఆలస్యం అయితే రాత్రివేళలో ఇబ్బందులు పడుతున్నారు. మరి ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశ పెట్టడంతో, బస్సులు కోసం ఎదురుచూసే మహిళా ప్రయాణికులు చీకట్లో పడి కాపులు కాయాల్సివస్తుంది. అధికారులు స్పందించి కాంతివంతమైన విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులతోపాటు, స్థానికులు కోరుతున్నారు.

# గ్రామంలో 11మంది నిరుపేద కుటుంబాలకు నిత్యవసర వస్తువులు అందజేత



**విశ్వాసేన వాయిస్, మే 21, తిరుమలయపాలెం:** కొక్కిరేణి గ్రామంలో చేగువేరా భూపతి ఫౌండేషన్ ( సిబిఎఫ్ ) చైర్మన్ జి చంద్రశేఖర్ ద్వారా బుధవారం ఆకలితో అలమటిస్తున్న 11మంది నిరుపేద కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి తిరుమలయపాలెం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిశిలార్ సాహెబ్ మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ జగదీష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామ సెక్రటరీ భావ్య ఆధ్వర్యాలో 11 కుటుంబాలకు శ్రేష్టమైన రైస్ తో పాటు నిత్యవసర వస్తువులు అందించడం జరిగింది. ఇప్పటి వరకు ఇలాంటి నిరుపేదలను ఇప్పటివరకు 690 కుటుంబాలకు సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమములో సిబిఎఫ్ బృందం ఘంటా భీమయ్య, మాచర్ల కొండల రావు, కనకం ఆది, సప్పిడి నాని, సింగర్ కొమ్ము రమేష్, కొండ సందీప్, గోపోజు సుధాకర్, ఎహ్ హరిత శ్రీ, కే అరుణ, జి .రాధిక, ఆ గ్రామస్తులు మాజీ సర్పంచ్ గంట నిర్మల కృష్ణ, గంట రవి, గుగ్గిళ్ళ భూపతి రావు, గుగ్గిళ్ళు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు పురుగు మందులను అరికట్టాలి

## తెలుగుదేశం పార్టీ పాలేరు నియోజకవర్గ భాద్యులు కొండబాల కరుణాకర్

**విశ్వసేన వాయిస్, మే 21, తిరుమలయపాలెం:** రైతులకు వ్యవసాయసీజన్ మొదలైందని నకిలీ విత్తనాలను అరికట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కొండబాల కరుణాకర్ డిమాండ్ చేసారు. ఆరుగాలం యండనక వాన అనక రైతులు కష్టపడి అప్పులు చేసి విత్తనాలు కొంటే అవి నకిలీ విత్తనాలు అయి పంట పండక రైతులు తను చేసిన కష్టం హృదానే కాక అప్పుల పాలై ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని కావునా విత్తనాలు పురుగు మందులు అమ్మే డీలర్ల పై ప్రభుత్వ అధికారులు సంబందిత వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లను కనిపెట్టి చర్యతీసుకొని కేసు పెట్టాలని వారు డిమాండ్ చేసారు. ఒక పక్క నకిలీ విత్తనాలతో పంట పండగక పోవటం పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవటం తో దిక్కుతోచని స్థితిలో రైతులు వున్నారని రైతుకి గిట్టుబాటు ధరలు కల్పించాలని వారు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. లేనియడల రైతుల పక్షాణ తెలుగుదేశం పార్టీ పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



అను దినం - జనం వాయిస్
https://www.viswasenavoice.com
విశ్వసేన వాయిస్
VISWASENA VOICE TELUGU DAILY

# ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

## సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్



**విశ్వసేన వాయిస్, మే 21, కొణిజర్ల:** గత ఆరు వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మండల పరిధిలో బోడియ తండా ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశంలో సందర్శించి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ఆరువారాల నుంచి పనిచేస్తూన్న బిల్లులు సకాలంలో అందటం లేదని, గుట్టల పక్కన వర్షపు నీరు వెళ్ళటానికి కాలువల పని కష్టంగా ఉందని కూలీలు తమ గోడును తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఉద్దేశించి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ సర్కార్ లో తీసుకురావడం జరిగిందని, నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తూ బడ్జెట్ లో నిధులు సక్రమంగా కేటాయించకుండా కోతలు విధించిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం పేదలంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు సకాలంలో చెల్లించడం కోసం సిపిఎం ప్రజాసంఘాలు పోరాడుతుందని గుర్తు చేశారు. ఈ నెల 30న ఉపాధి కూలీల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను ఉపాధి కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు అర్హులైన పేదలందరికీ అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై సిపిఎం పోరాడుతుందని సమస్యల పరిష్కారం కోసం ప్రజలందరూ ఉద్యమాలలో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉపాధి హామీ టెక్నికల్ ఆఫీసర్ కు ఫోన్ ద్వారా సమస్యలను వివరించి, వేతనాలు తగిన స్థాయిలో అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తనికెళ్ల గ్రామ నాయకులు యాస వెంకటేశ్వర్లు, ఉపాధి కూలీలు ధరావత్ శ్రీను, ధరావత్ సక్కు, అజ్మీర రాముడు, ధరావత్ రాం లాల్, వాంకుడోత్ సుభాని, ధరావత్ సరోజ, భూక్యా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కాల్వొడ్డులో రాజీవ్ గాంధీ విగ్రహానికి ఘన నివాళి అర్పించిన డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్




**విశ్వసేన వాయిస్, మే 21, ఖమ్మం:** స్థానిక కాల్వొడ్డు లోని దివంగత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. 46 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ దేశానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసిన వ్యక్తిగా చిరస్మరణీయుడుగా నిలిచారని రాజీవుని బాటలో నేటి యువత అన్ని రంగాల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు. దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరుతో నిరుద్యోగ యువతకు ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్తా సీతారాములు, కన్నం ప్రసన్న కృష్ణ, గజ్జల వెంకన్న, ఆర్ టి ఏ మెంబర్ గజెల్లి వెంకన్న, 46, 47 డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జి, షేక్ జానీ, సేవాదళ్ నాయకులు గౌస్ మరియు నాయకులు అల్లె సాయి కిరణ్, యూసఫ్, జాకీర్, కంకిపాటి శ్రీను, ఫరీద్, పుదుచ్చేరి ఆనంద్, మండవ జానీ, కాటం యాదయ్య, శనిగరం ఉప్పలయ్య, బాల్దె నాగేశ్వరరావు, ధరావత్ రాజు, కేశోజు వీరాచారి, ఏనుగు మహేష్, బండ వెంకటేష్, ఎమ్మె రామకృష్ణ, అంకాల వీరభద్రం, షుకూర్, కోటి మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

## మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రావు



**విశ్వసేన వాయిస్, మే 21, తిరుమలాయపాలెం:** తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక విద్యను గాడిలో పెట్టేందుకు దృఢ సంకల్పంతో ఉందని విద్యార్థులకు సులభతరంగా నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20 నుంచి 24 వరకు ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి యం. శ్రీనివాసరావు అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో సుమారు ఐదు రోజులపాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని ఈ శిక్షణ తరగతులు ద్వారా ఉపాధ్యాయులకు ఎంతో మేలు జరుగుతుందని ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు మళ్లించే దిశగా అడుగులు వేయాలని ప్రవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 135 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయినీలు శిక్షణలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది మంది శిక్షణ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అకాల మరణం చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన భూక్య సురేష్ నాయక్



**విశ్వసేన వాయిస్, మే 21, ఖమ్మం:** ఆపద అనే పదం చెవిలో పడేలోపే, నేను ఉన్నాను అని తనవంతు సహాయం చేయడానికి ముందు ఉండే మంచి మనిషీ మన భూక్య సురేష్ నాయక్. తన సొంత మండలంలోనే కాదు, పాలేరు నియోజకవర్గంలో ఏ మండలంలోనైనా ఆపదలో ఉన్నారు అని తెలిస్తే, క్షణం ఆలోచన చేయకుండా తనవంతుగా ఏదో రూపంలో సహాయం చేయడానికి వెనుకాడని మంచి మనిషి మన భూక్య సురేష్ నాయక్. కూసుమంచి మండల కేంద్రంలో నలగాటి అక్కమ్మ మరణ వార్త విని, బుధవారం తనవంతుగా 50కేజీల బియ్యం, 3000 ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ హాఫీజుద్దీన్, మాదాసు ఉపేందర్ రావు, బెల్లంకొండ వెంకన్న, బారి వీరభద్రం, షేక్ నాగుల మీరా, పేంద్ర ఆంజయ్య, వసుకుల రామారావు, దామళ్ల పాపారావు, కాంగ్రెస్ యువజన విభాగం బెల్లంకొండ సాయి కిరణ్, మొహమ్మద్ రఫీ, వడిత్య సైదా నాయక్, కొమ్ము సుధాకర్, నలగాటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అను దినం - జనం వాయిస్
https://www.viswasenavoice.com
విశ్వసేన వాయిస్
VISWASENA VOICE TELUGU DAILY



# హరిహర వీరమల్లు నుంచి మరో పాట




**విశ్వసేన వాయిస్, మే 21,** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లాంగ్ అవైటెడ్ చిత్రం 'హరిహర వీరమల్లు'. నిజ జీవిత యోధుడు వీరమల్లు జీవిత కథ ఆధారంగా దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, సహా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం కోసం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు.. ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు విడుదలకు సిద్ధం అవుతుండగా మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ఆల్రెడీ స్టార్ట్ చేశారు. ఇప్పటికే రెండు పాటలు విశేషంగా ఆకట్టుకోగా తాజాగా మూడో పాట విడుదల చేశారు.అసుర హననం అంటూ సాగిన ఈ సాంగ్ అనుకున్నట్టుగానే మంచి పవర్ ఫుల్ గా ఉందని చెప్పాలి. కీరవాణి ఇచ్చిన ట్యూన్ సహా రాంబాబు గోసల సాహిత్యం స్టన్నింగ్‌గా ఉన్నాయని చెప్పవచ్చు. మొత్తం ప్లే బ్యాక్ సింగర్స్ తోనే పాడించిన, ఈ పాట వింటుంటే ఒళ్ళు నిక్కబొడుచుకుంటుంది. అంతే కాదు ఈ లిరికల్ వీడియోలో విజువల్స్ కూడా బాగున్నాయి. పవన్ పై పలు పోరాట సన్నివేశాల దృశ్యాలు ఒక్కొక్కటి గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. మొత్తానికి రెండు సింపుల్ సాంగ్స్ తర్వాత మంచి పవర్ సాంగ్‌ని మేకర్స్ ఇపుడు విడుదల చేసారు. ఇక ఈ చిత్రం ఈ జూన్ 13న పాన్ ఇండియా భాషల్లో సినిమా విడుదల కాబోతుంది.


# కన్నప్ప నుంచి పోస్టర్ విడుదల

**విశ్వసేన వాయిస్, మే 21,** మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లను అందుకుంటున్నారు సూపర్ స్టార్ మోహన్ లాల్. ఆయన నటిస్తున్న చిత్రాలన్నీ కూడా వరుసగా 200 కోట్ల వసూళ్లతో అదరగొడుతున్నాయి. ఇక త్వరలోనే మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' తో ఆడియన్స్ ముందుకు రానున్నారు మోహన్ లాల్. 'కన్నప్ప' నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. క్యారెక్టర్ పోస్టర్లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. అయితే జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి తాజాగా అందరినీ ఆకట్టుకునే అప్డేట్‌ను వదిలారు. ఈ రోజు మోహన్ లాల్ పుట్టిన రోజు (మే 21) సందర్భంగా కన్నప్ప నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ వీడియోలో మోహన్ లాల్ స్క్రీన్ ప్రెజెన్స్, కనిపించిన తీరు అన్నీ అద్భుతంగా ఉన్నాయి. గూస్ బంప్స్ తెప్పించేలా ఈ గ్లింప్స్‌ను కట్ చేశారు. దీని బట్టి చూస్తే, కిరాత పాత్రలో మోహన్‌లాల్ ప్రెజెన్స్, యాక్టింగ్ అందరినీ ఆకట్టుకోవడం కాయం. ఈ చిత్రంతో మళ్లీ ఆడియెన్స్‌పై తన ముద్రను వేసేలా కనిపిస్తున్నారు. దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత అనే పాత్రను మోహన్‌లాల్ పోషించారు. ప్రస్తుతం విష్ణు మంచు, కన్నప్ప టీం ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా




ఉండగా, ఇప్పటికే యూఎస్ టూర్‌ను పూర్తి చేశారు.

# జూన్ 5న కమలహాసన్ థగ్‌లైఫ్ విడుదల




**విశ్వసేన వాయిస్, మే 21,** కమల్ హాసన్ నటించిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తోన్న ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఐశ్వర్యలక్ష్మి, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కమల్ హీరో మాత్రమే కాదు నిర్మాత కూడా. ప్రొడక్షన్ హౌస్ రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్, దర్శకుడు మణిరత్నానికి చెందిన మద్రాస్ టాకీస్, ఉదయనిధి స్టాలిన్‌కు రెడ్ జెయింట్ ఫిలింస్ మీద సినిమా రూపొందింది. ఇక.. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన రాగా. ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ డేట్ గురించి కమల్ హాసన్ క్లారిటీ ఇచ్చారు. రీసెంట్ గా ఓ మీడియాతో ముచ్చటించగా.. ఓటీటీలోకి ఎప్పుడు వస్తుంది? అంటే.. 'ఆగస్టు వరకు వెయిట్ చేయాలి. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాత మాత్రమే మా సినిమా ఓటీటీ లోకి వస్తుంది' అని కమల్ హాసన్ స్పష్టం చేశారు. కాగా ఈ 'థగ్ లైఫ్' ఓటీటీ హక్కులను ఇంటర్నేషనల్ ఎలాట్‌ఫార్మ్ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా. తమిళం తో పాటు తెలుగు, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారట.